క్లుప్తంగా

ఆస్పత్రిలో పరిశుభ్రతపై అవగాహన



మాడుగుల ఆస్పత్రిలో పరిశుభ్రతపై వివరిస్తున్న వైద్యాధికారి సంతోష్ కుమార్

మాడుగుల : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో శుభ్రత, వైద్య సేవలు గురించి వైద్యాధికారి సంతోష్‌కుమార్ స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు మండల సుబ్బలక్ష్మి, వద్దాది వరలక్ష్మి, పుట్టా నానాజీ, రొబ్బా మహేష్ ,దర్శిశెట్టి అప్పి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

కె.కోటపాడు : వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని లంకవానిపాలెం పీహెచ్‌సీ పి.హెచ్.ఎన్.ప్రమీల అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలను జరిపారు. 138 మందికి ఆరోగ్య పరీక్షల నిర్వహణతో పాటు ఉచితంగా మందులను ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలతో పాటు జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్ఎం.పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చోద్యంలో కోటకొండమ్మ జాతర

గొలుగొండ : చోద్యం గ్రామంలో మంగళవారం కోటకొండమ్మ జాతర నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రాంతంలో ఇలవేల్పు అయిన ఈ జాతర ఉదయం నుండి ప్రారంభం కావడం జరుగుతుంది, భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్, కమిటీ సిబ్బంది అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం కోసం మంగళవారం ఉదయం నుంచి భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు.

సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



సూచనలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసనాయుడు

నాతవరం : రెవెన్యూ పరమైన సమస్యలపై రైతులు నుంచి వచ్చిన దరఖాస్తులను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసనాయుడు అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు, అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్వోలదే అన్నారు. మండల వ్యాప్తంగా రెవెన్యూ పరమైన సమస్యలపై క్లస్టరు వారీగా సమీక్షించారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ ఆర్ఐ హరి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, వీఆర్వోలు సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే బండారు

చీడికాడ : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం దిబ్బపాలెం, దండిసురవరం, ,బైలపూడి గ్రామాలల్లో పర్యటించారు. దండిసురవరం గ్రామంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని అన్నారు.

సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయుల వెన్నంటే...

రోలుగుంట: సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయుల వెన్నంటే ఏపీటీఎఫ్ ఉంటుందని ఆ సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు, మండల ప్రధాన కార్యదర్శి బోనెల రాము అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా, మండల కమిటీ నాయకులతో సోమవారం వారు మండలంలో గల పాఠశాలలు సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యలను నమోదు చేసుకున్నారు. ప్రతి సమస్యను పరిస్కరించడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.నూకరాజు, కార్యదర్శి ఆర్.వి.ఎస్.ఆర్ శర్మ, మండల సంఘం అధ్యక్షుడు పి.రమణ పాల్గొన్నారు.



లోపూడి డాల్ఫిన్ డెయిరీ వద్ద బురద రోడ్డు



బంగారుమెట్ట వద్ద ...



బుదిరెడ్లపాలెం వద్ద..

బాబోయ్ బీఎన్ రోడ్డు

భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో ప్రయాణమంటే వాహనదారులు భయభ్రాంతులకు గురౌవుతున్నారు. తారు మొత్తం ఊడిపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. చెరువును తలపిస్తున్న ఈ గోతుల్లో చేరిన నీళ్ల, పంట పొలాలను తలపించేలా రోడ్డుపై పేరుకు పోయిన బురద, అడుగు తీసి అడుగు వేయలేని ఆ దారిలో వెళుతూ బురదలో కూరుకుపోయి జారిపోతున్న వాహనాలు... ఇదీ బీఎన్ రోడ్డు దుస్థితి.

- నరకంగా మారిన ప్రయాణం
- రోలుగుంట నుంచి గంధవరం వరకు అధ్వానంగా మారిన వైనం
- పెద్దపెద్ద గోతులు, బురదతో వాహనదారుల అవస్థలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని పాలకులు



శంకరాపురం వద్ద గోతుల మయంగా మారిన రోడ్డు



శింగవరం బస్‌స్టాప్ వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడ్డ గొయ్యి



బీఎన్ రోడ్డులో గోతులను తప్పించడానికి అవస్థలు పడుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్

బుచ్చెయ్యపేట : నర్సీపట్నం, చోడవరం, పెందుర్తి, భీమునిపట్నం తదితర నియోజకవర్గాల మీదుగా ఈ రహదారిపై మాడుగుల, పాడేరు, అనకాపల్లి, పాయకరావుపేట తదితర నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. పేరుకే భీమునిపట్నం, నర్సీపట్నం ప్రధాన రోడ్డు అయినా అభివృద్ధిలో మాత్రం దీనస్థితిలో ఉంది. రోలుగుంట మండలం చెట్టుపల్లి నుంచి చోడవరం మండలం గంధవరం వరకు 40 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు దెబ్బతింది. పెద్దపెద్ద గోతులు పడి వర్షం నీరు చేరి వాహనాల రాకపోకల తాకిడికి బురద మయంగా మారింది. రోలుగుంట, కొత్తకోట, దొండపూడి, మేడివాడ, బుదిరెడ్లపాలెం, పీడీ పాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, వడ్డాది, గోవాడ, వెంకన్నపాలెం, గంధవరం గ్రామాల మధ్య ఈ రహదారిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. బుదిరెడ్లపాలెం, మేడివాడ, బంగారుమెట్ట, రోలుగుంట తదితర గ్రామాల వద్ద ఇటీవల బురదలో వాహనాలు దిగిపోవడంతో పొక్లెయిన్‌లు, ట్రాక్టర్లకు తాళ్లు కట్టి బయటకు లాగాల్సి వచ్చింది. దీంతో ఈ రహదారిలో ప్రయాణమంటేనే వాహనదారులు హడలి పోతున్నారు. ఈ రూటులో తిరిగే నర్సీపట్నం, చోడవరం , విశాఖ, కొత్తకోట, పాడేరు కాకినాడ, పాడేరు ఆర్టీసీ బస్సులను బీఎన్ రోడ్డు గోతుల్లో నుంచి నడపలేమని డ్రైవర్లు వాపోతున్నారు. ప్రతి రోజు ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు ఇతర వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల బంగారుమెట్ట జంక్షన్ వద్ద ట్రాక్టర్ బోల్తాపడగా డ్రైవర్ గాయాలతో బైట పడ్డాడు.

గోతులను పూడ్చని కూటమి ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా కనీసం బీఎన్ రోడ్డులో గోతులను పూడ్చలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముందుగా బీఎన్ రోడ్డు పనులనే ప్రారంభిస్తామని చెప్పిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు మిగిలిన టీడీపీ నాయకులతో పాటు చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు కూడా బీఎస్ రోడ్డు అభివృద్ధి గురించి మాట్లాడకపోవడంపై పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో బీఎన్ రోడ్డు అభివృద్ధి గురించి హామీలు గుప్పించిన కూటమి నేతలు ఇపుడు అధికారంలోకి వచ్చిన తరవాత బీఎన్ రోడ్డు సంగతే మరిచారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు బీఎన్ రోడ్డులో గోతులను పూడ్చి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

రోడ్డు సమస్య తీర్చండి..



మా గ్రామం వద్ద తారు మొత్తం ఊడిపోయి మట్టి రోడ్డుగా తయారైంది. పెద్ద పెద్ద గోతుల్లో చేరిన వర్షం నీటితో బురద మయంగా తయారై ప్రతి రోజు పలు వాహనాలు బురదలో కూరుకు పోతున్నాయి. పొక్లెయిన్లు, ట్రాక్టర్లకు తాళ్ళ కట్టి వాహనాలను బైటకు లాగుతున్నాం. బురదలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు బీఎన్ రోడ్డులో గోతులను పూడ్చించి రహదారి బాగు చేయాలి.

– పల్లా అప్పారావు,బుదిరెడ్లపాలెం

ఈ గోతుల్లో వాహనాలు నడపలేం



బీఎన్ రోడ్డులో గోతుల్లో నుండి ఆటోను నడపడానికి తీవ్ర అవస్థలు పడుతున్నాను. ప్యాసింజర్లను ఎక్కించుకుని గోతుల్లో నుండి బురదలో నుండి వెళ్లేటపుడు ఏ ప్రమాదం జరగకుండా చూడాలని ప్రతి రోజు దేవున్ని ప్రార్థిస్తూ భయపడుతూనే ప్రయాణం సాగిస్తున్నాను. గోతులు, బురద వల్ల నా ఆటో తరుచూ మరమ్మతులకు గురవడంతో పాటు నాకు వెన్నునొప్పితో బాధ పడుతున్నాను.

–చల్లా మహేష్, ఆటోడ్రైవర్, పాలెం

ప్రజల సహకారంతోనే పల్లెల్లో పరిశుభ్రత

దేవరాపల్లి : ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం సాధ్యపడుతుందని దేవరాపల్లి ఎంపీడీవో కె.చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు ఎం.అలమండ, మామిడిపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీని నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యంతో ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అనంతరం ఎం.అలమండలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం, పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మామిడిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించారు. ఎం.అలమండ, మామిడిపల్లి పంచాయతీ కార్యదర్శులు పి.శివ ప్రసాద్, సుధాకర్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోదమాంబను దర్శించుకున్న డీఎస్పీ



మోదమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న విజయనగరం డీఎస్పీ వెంకటప్పారావు కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం ప్రధాన ఆరాధ్యదైవం, మోదకొండమ్మ అమ్మవారిని విజయనగరం డీఎస్పీ వేగి వెంకటప్పారావు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కె.జె.పురం గ్రామానికి చెందిన వెంకటప్పారావు అమ్మ దయతో గ్రామం సుభిక్షంగా వుండాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట స్థానిక సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు. అనంతరం కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయం పక్కన్న నిర్మాణంలో వున్న నిత్యాన్నదాన సత్రం భవనాన్ని డీఎస్పీ వెంకటప్పారావు పరిశీలించారు. సత్రం నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



విజేతలతో ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు

నర్సీపట్నం : స్వచ్ఛతాహిసేవలో భాగంగా మున్సిపాలిటీ పరిధి పాత బయపురెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఐటీఐ వారు విద్యార్థులకు స్వచ్ఛతా హి సేవపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి బి.దీపిక, ద్వితీయ బహుమతి ఇ.శరణ్య తదితరులు ఎంపికయ్యారు. వీరికి ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిళ్లు బహుమతులగా అందజేసారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పోటీలను నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.శాంతాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐదేళ్లలో గ్రామాలకు పక్కా డ్రైనేజీ వ్యవస్థ



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం : రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి పూర్తిస్థాయిలో పక్కా డ్రైనేజీ సదుపాయం కల్పిస్తామని అసెంబ్లీ స్పీకర్ సిహెచ్. అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వంద రోజుల పాలనలో భాగంగా మండలంలో లచ్చన్నపాలెంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లచ్చన్నపాలేనికి రూ.2.45 కోట్లు, పైడిపాల రూ.2.80 కోట్లు, జి.కోడురుకు రూ.1.29 కోట్లతో సీసీ డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రతి పంచాయతీకి రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించామన్నారు. విశాఖ డెయిరీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపిస్తామన్నారు. పాల సొసైటీ ప్రెసిడెంట్లకు 4 గ్రాముల బంగారం ఇచ్చి డైయిరీ నుంచి కోట్ల రూపాయలు దోచేశారని ఆరోపించారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం, సర్పంచ్‌లు పోతల రామలక్ష్మి, అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

26న సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక

దేవరాపల్లి : ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజా వేదిక సమావేశాన్ని ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఏపీవో డి.చంద్రకళ తెలిపారు. 2023 మార్చి నుంచి 2024 ఆగస్టు వరకు చేపట్టిన ఉపాధి హామీ పథకంతో పాటు పంచాయితీరాజ్‌లో చేపట్టిన పనులపై 17వ సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పనులు పర్యవేక్షించడంతో పాటు గ్రామసభలు సైతం నిర్వహించారన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించే మండల స్థాయి ప్రజావేదిక సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆమె కోరారు.

2 నుంచి బాలికల హాస్టళ్లలో ప్రవేశాలు

బుచ్చెయ్యపేట : అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు నుంచి వడ్డాది,రోలుగుంట మండలం నాయుడు పాలెం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న నూతన కస్తూరిభా వసతి గృహంలో చేరేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు తెలిపారు. సోమవారం టీడీపీ వంద రోజుల పాలనపై మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు వచ్చిన ఆయన రెండు గ్రామాల్లో వసతి గృహాలు మంజూరు అయ్యాయన్నారు. 9,10,ఇంటర్ చదువుతున్న బాలికలకు వసతి గృహాలు మంజూరు అవడంతో ఈ నెల 30 తేదీ లోగా అవసరమైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి హాస్టల్లో చేరేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కాశీ విశ్వేరరావుకు సూచించారు. వసతి గృహాల మంజూరు పత్రాలను ఎంఈవోకు అందించారు.

'సూపర్ సిక్స్ అమలు చేస్తాం'

మాడుగుల రూరల్ : కూటమి ప్రభుత్వం 100 రోజులు పాలనలో జరిగిన అభివృద్ధి ఎంతో ఉందని, మండల దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పొంగలిపాక గ్రామములో సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి ప్రచారం చేపట్టారు. స్టికర్లు ఇంటింటికీ వెళ్లి అతికించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిన దేముడమ్మ, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిరావు, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరరావు పాల్గొన్నారు.

ఆనందపురంలో సీపీఎం మహాసభ



సీపీఎం జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయిని బాబు, ముత్యాలనాయుడు

కె.కోటపాడు : మండలంలో ఆనందపురం గ్రామంలో సోమవారం సీపీఎం శాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు, పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు పార్టీ జెండా ఆవిష్కరించారు. నాయినిబాబు మాట్లాడుతూ రీసర్వేలో రైతులకు ఎదురయ్యే సమస్యలకు రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. పోతనవలస, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ఆశా కార్యకర్తలను నియమించడంతో పాటు అసంపూర్తిగా నిర్మాణం జరిగిన అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయాలన్నారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సక్రమంగా జరిపి రైతులకు రాయితీతో కూడిన ప్రోత్సాహకాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 12 అర్జీలు



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేస్తున్న అర్జీదారులు

నర్సీపట్నం : ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో డివిజన్‌లోని వివిధ సమస్యలపై 12 అర్జీలు వచ్చినట్లు కార్యాలయ ఏవో సూర్యనారాయణ తెలిపారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారిక కార్యక్రమాల్లో ఉండడంతో ఏవో ఫిర్యాదులను స్వీకరించారు. నర్సీపట్నం ఇందిరా మార్కెట్‌లో జరిగిన అవకతవకలపై లోకాయుక్త ఆదేశాలను అమలు చేయాలని, మున్సిపల్ అధికారులు, మండల పరిషత్ అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో మార్కెట్‌లో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్‌కు వచ్చే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శివనారాయణరాజు, పాకలపాటి అరవింద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. నర్సీపట్నంలో విద్యార్థులు, యువత గంజాయికు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొత్తకోట గ్రామంలో బుద్ధుడు మందిరం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ దళిత బహుజన సంక్షేమ సమాజం జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, శానిటేషన్, సదరం సర్టిఫికేట్లు కొరకు ఫిర్యాదులు వచ్చాయని ఏవో తెలిపారు. ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఏవో తెలిపారు.

వడ్డాదిలో స్కూల్ గేమ్స్ ప్రారంభం



స్కూల్ గేమ్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. మెదటి రోజు బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బాడ్మింటన్,రన్నింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. మండలంలో 9 పాఠశాలలు గున్నెంపూడి, రాజాం, సీతయ్యపేట, పెదమదీన, విజయరామరాజుపేట, వడ్డాది, దిబ్బిడి, తురకలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు వడ్డాది కేజీబీవీ పాఠశాలకు చెందిన 176 మంది విద్యార్థినులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వాలీబాల్ అండర్ 17 పోటీలో విజయరామరాజుపేట, వడ్డాది, అండర్ 14లో వడ్డాది,విజయరామరాజుపేట, ఖోఖోలో అండర్ 17లో విజయరామరాజుపేట, తురకలపూడి, అండర్ 14లో విజయరామరాజుపేట, తురకలపూడి, కబడ్డీలో అండర్ 17లో విజయరామరాజుపేట, కేజీబీవీ వడ్డాది, అండర్ 14లో దిబ్బిడి, కేజీబీవీ వడ్డాది, బాల్‌బాడ్మింటన్ అండర్ 17లో వడ్డాది హైస్కూల్, వడ్డాది కేజీబీవీ, అండర్ 14లో వడ్డాది హైస్కూల్, కేజీబీవీ వడ్డాది జట్లు వరసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వంద మీటర్ల పరుగు పందెంలో పెదమదీన హై స్కూల్‌కు చెందిన తేజశ్విని, యామిని ప్రథమ,ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకట రమణ, ఈవో లవరాజు, హెచ్ఎం శేషుబాబు, పీఈటీ నరిసింగ్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల నాణ్యత పరిశీలన



రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గొలుగొండ : ఆరిల్లోవ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను విజిలెన్సు అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణం చేసి మూడు నెలలు కావడంతో పనుల నాణ్యతపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుమారుగా రూ.4 కోట్ల మేర ఈ పనులు గత ప్రభుత్వంలో పనులు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్పీకర్‌గా బాధ్యతలు తీసుకున్న అయ్యన్నపాత్రుడు ఈ రోడ్డు పనులు నాణ్యతగా జరగలేదని అప్పట్లో ఆరోపించారు. దీనిపై రెండు నెలలు క్రితం రాష్ట్ర విజిలెన్సు బృందం సభ్యులు పరిశీలించారు. ప్రాథమికంగా పరిశీలన చేసి పనుల్లో నాణ్యతాలోపం లేదని తెలిపారు. సోమవారం జిల్లా విజిలెన్సు అండ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి స్నేహిత, డీఈఈ హరిబాబు, ఏఈఈ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో సుమారుగా 3.5 కిలోమీటర్లు మీరు జరిగిన రోడ్డు పనుల నాణ్యతల కొలతలు తీసే పనులు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ ఆర్‌అండ్‌బీ శాఖతో పాటు పీఆర్ డీఈఈ క్వాలిటీ కంట్రోల్ పాత్రుడు, ఏఈఈ ప్రసాద్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. జరిగిన పనులపై ప్రాథమికంగా సంతృప్తి చెందినట్టు తెలిసింది. ఈ నివేదికను రాష్ట్ర అధికారులకు పంపుతున్నట్టు అధికారులు తెలిపారు.

సంపద కేంద్రాలతో సేంద్రియ ఎరువు లభ్యం

కె.కోటపాడు : గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎ.కోడూరులో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజలకు ఆయన పారిశుధ్యంపై సూచనలు చేశారు. ప్రజలు వేసే తడి చెత్తను సంపద తయారీ కేంద్రంలో సేంద్రియ ఎరువుగా మార్చి, ఆ ఎరువును రైతులకు తక్కువ ధరకే అందించడం జరుగుతుందని తెలిపారు. తద్వారా రైతులకు మంచి ఆరోగ్యకరమైన పంటతో పాటు సేంద్రియ ఎరువుల అమ్మకం ద్వారా పంచాయితీకి ఆదాయం సమకూరుతుందన్నారు. ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

సెజ్ ప్రతిపాదిత గ్రామాల రైతుల్లో ఆందోళన

కె.కోటపాడు : సెజ్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ఆర్లితో పాటు పరిసర గ్రామాల్లో గల రైతుల్లో పంటలు పండే వారి భూములు పోతే ఎట్లా జీవనం సాగించాలన్న ఆందోళన వ్యక్తం అవుతుందని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. ఆర్లి, గొండుపాలెం, గుల్లేపల్లి, చింతపాలెం, గరుగుబిల్లి గల రైతులు ప్రభుత్వం సెజ్ ఏర్పాటుకు తమ సాగులో ఉన్న భూములను పరిశీలన చేయడంతో ఆయా కుటుంబాల్లో ప్రతి ఒక్కరూ భయాందోళనలకు గురవుతున్నట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెజ్ ఏర్పాటుకు చింతపాలెం ప్రాంతంలో సర్వేను చేపట్టేందుకు అధికారులు యత్నించగా రైతులు అభ్యంతరం తెలిపారని వెంకన్న పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు నిలపండి



బుచ్చెయ్యపేటలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ,యువకులు

బుచ్చెయ్యపేట : రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరోకరి ప్రాణాలు కాపాడాలని ఎస్ఐ ఎ..శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి బుచ్చెయ్యపేట, దిబ్బిడి గ్రామాల్లో వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజు చేపట్టిన మెగా రక్తదాన శిబిరంను విజయవంతం చేయాలని యువకులు, సంస్థ సభ్యులతో కలిసి ఎస్ఐ వీధుల్లో ప్రచారం చేశారు. గాంధీ జయంతి రోజున ఉదయం 7 గంటల నుంచి వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వెయ్యి మందితో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని యువతీ, యువకులంతా ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రక్తదాన సేకరణ టీం లీడర్ బాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.